TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 | సంచిక :140 | prajadivvs57@gmail. com | శుక్రవారం 3 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 4 | వెల : 3/-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని ఆయుధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

## ఒరాకిల్ లేఆఫ్ బాంబు




- 30వేల మంది టెక్కీల తొలగింపు!
- అందులో 12 వేలమంది భారతీయులే..
- తెల్లవారుజామున 6 గంటలకే టర్మినేషన్ మెయిల్స్
- లాభాల్లో ఉన్నా ఖర్చుల కోత పేరిట వేటు
- ఐటీ లోకంలో తీవ్ర కలకలం

ప్రపంచ ప్రసిద్ధ సాఫ్ట్‌వేర్ దిగ్గజం 'ఒరాకిల్' ఐటీ రంగంలో పెను సంచలనం సృష్టించింది. సంస్థాగత పునర్వ్యవస్థీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన సిబ్బందిలో ఏకంగా 18 శాతం మందిని ఇంటికి పంపాలని నిర్ణయించింది. ఈ భారీ కోతలో భాగంగా దాదాపు 30,000 మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయారు. అత్యంత విచారకరమైన విషయం ఏంటంటే.. ఈ బాధితుల్లో సుమారు 12,000 మంది భారతీ-యులే ఉన్నట్లు సమాచారం.

## నాటో నుంచి తప్పుకుంటాం



- అది 'కాగితపు పులి' కూటమి..
- ఇరాన్ యుద్ధంలో మిత్రదేశాల సహకారం సున్నా.. అందుకే ఈ ఆలోచన
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలనం
- బ్రిటన్ నౌకాదళంపై ఎద్దేవా..
- ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన కీర్ స్టార్మర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ వేదికపై మరోసారి బాంబు పేల్చారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైనిక కూటమిగా భావించే నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) నుంచి అమెరికా వైదొలిగే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

## భూ వివాదాలకు చెక్!

### నేటి నుంచి భూభారతి అమలు

ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా సేవలు ప్రారంభం

ప్రతి సర్వే నంబర్‌కు 'భూధార్' ▪ అధికారులతో పొంగులేటి సమీక్ష





"రాష్ట్రంలో దశాబ్దాలుగా వేధిస్తున్న భూవివాదాలకు చరమగీతం పాడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'భూభారతి' పోర్టల్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఐదు ఎంపిక చేసిన మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. బుధవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పొంగులేటి వివరాలు వెల్లడించారు.

ᵉ:తెలంగాణలో భూవివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది. ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. మొదటి దశలో ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా

మిగతా 2 లో



## కొత్త పట్టాదారులకు 'రైతు భరోసా' ఊరట

▪ ఏప్రిల్ 15 నుంచి నిధుల జమ! ▪ 85వేల మంది కొత్త రైతులకు లబ్ధి..

- దరఖాస్తుల పరిశీలనలో వ్యవసాయ శాఖ
- యాసంగి రెండో విడతగా రూ. 9,000 కోట్ల పంపిణీ లక్ష్యం

2



## అడుగంటుతున్న జూరాల

- పాలమూరు రైతాంగంలో సాగునీటి సెగ!
- డెడ్ స్టోరేజీకి చేరిన నీటిమట్టం
- ఎండిపోతున్న కోయిల్ సాగర్ ఆయకట్టు
- కర్ణాటక సర్కారుతో మంత్రి ఉత్తమ్ సంప్రదింపులు
- 5 టీఎంసీల కోసం విజ్ఞప్తి

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. దీంతో సాగునీటితో పాటు, తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోంది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

2



కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు

## తీపి కబురు

ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం

2



## రెండు జీపీలకు వికాస్ పురస్కారాలు

'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్' అవార్డుల ప్రకటన

హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క..

.. వివరాలు 2లో



రాష్ట్రంలో జరుగుతున్న మైనింగ్ స్కామ్‌పై ప్రభుత్వం సీఐడీ విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని, దీనిపై తక్షణమే 'హౌస్ కమిటీ' వేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

## పొంగులేటి అక్రమాలపై 'హౌస్ కమిటీ' వేయాల్సిందే

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ ▪ సీఐడీ విచారణతో న్యాయం జరగదు

▪ కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలి

ప్రజల పక్షాన ప్రశ్నిస్తే కేసులతో గొంతు నొక్కుతారా? : బీఆర్ఎస్ నేతలు

## రేషన్ కార్డుల ఏరివేత దుర్మార్గం


5 లక్షల కార్డులు ఇచ్చి.. 15 లక్షలు తొలగించే కుట్ర



- ఐటీ రిటర్న్స్‌ను సాకుగా చూపడం అన్యాయం
- కొండగట్టు ఘటనపై విచారం..
- పనుల్లో నిర్లక్ష్యంపై విచారణకు డిమాండ్
- రాష్ట్ర ప్రభుత్వంపై కవిత ధ్వజం!

## నిప్పుల కొలిమిలా

రానున్న మూడు నెలలు మండుటెండలు ఖాయం!





- ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు
- పది రోజులకు పైగా వీయనున్న వడగాడ్పులు: ఐఎండీ హెచ్చరిక

2



# రెండు జీపీలకు వికాస్ పురస్కారాలు

**మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామాలకు అరుదైన గౌరవం!**

**'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్' అవార్డుల ప్రకటన**

**మంత్రి సీతక్క హర్షం వ్యక్తం.. పారదర్శక పాలనకు నిదర్శనమని వెల్లడి**

గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకమైన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల'ను ప్రకటించగా, రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలు ఈ గౌరవాన్ని దక్కించుకున్నాయి. వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన పంచాయతీలు వివిధ విభాగాల్లో జాతీయ స్థాయి అవార్డులను కైవసం చేసుకున్నాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' (ఉత్తమ పాలన) విభాగంలో జాతీయ పురస్కారాన్ని సాధించింది. అలాగే, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' (మహిళా అనుకూల పంచాయతీ) విభాగంలో అత్యుత్తమ గుర్తింపు పొందింది. గ్రామ స్థాయిలో పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం, మహిళా సాధికారత మరియు భద్రతలో చూపిన అసాధారణ కృషికి గాను ఈ అవార్డులు లభించాయి.

**మంత్రి సీతక్క అభినందనలు**

జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. పారదర్శక పాలన, మహిళా సంక్షేమం దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్ట చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ విజయం సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు జాతీయ స్థాయిలో రాష్ట్ర కీర్తిని చాటాలని ఆమె ఆకాంక్షించారు.

# జీఎస్టీ వసూళ్లలో 8.3శాతం వృద్ధి

**మార్చిలో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు**

దేశంలో జీఎస్టీ వసూళ్లు నెలనెలా భారీగా వసూలు అవుతున్నాయి. దీంతో కేంద్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ.22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

# దూసుకొచ్చిన కారు

**నేడు వివాహ నిశ్చితార్థం...అంతలోనే రోడ్డు ప్రమాదం**

:జిల్లాలో విషాదం నెలకొంది. ఎంగేజ్‌మెంట్ చేసుకోవాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణషాపుకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గొడ్డుగొర్ల ప్రసాద్(28) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతనికి వివాహం కూడా నిశ్చయమైంది. గురువారం నాడు నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణ షాపునకు ప్రసాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేప్పుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ప్రసాద్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, రేపు నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు.. ఇలా పాడే ఎక్కడంతో మద్దులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కొండగట్టు ఆలయంలో అపశృతి

**చలువ పందిళ్లు కూలి 15మందికి గాయాలు**



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

# అడుగంటుతున్న జూరాల



: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పడిపోవడంతో ఆయకట్టు రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో సాగునీటితో పాటు తాగునీటి ఎద్దడి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందకపోవడంతో చివరి ఆయకట్టు భూముల్లో పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం రంగంలోకి దిగింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి, తక్షణమే కనీసం 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూరుకు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. చేతికి వచ్చిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే రైతులు తల్లడిల్లిపోతున్నారు. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆల్మట్టి లేదా నారాయణపూర్ నుండి నీటిని విడుదల చేస్తేనే ఈ గండం నుంచి గట్టెక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలకొన్న సాగునీటి సంక్షోభంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపైనే రైతాంగం ఆశలు పెట్టుకుంది.



# నేటి నుంచి భూభారతి అమలు

మొదటి పేజీ తరువాయి

ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి సేవలు ప్రారంభం కానున్నాయి. ఇక్కడ వచ్చే ఫలితాలను విశ్లేషించి, అవసరమైన మార్పులు చేసిన తర్వాత రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. భూభారతి విధానంలో అత్యంత కీలకమైన అంశం 'భూధార్'. ఆధార్ కార్డు తరహాలోనే ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేకమైన భూధార్ నంబర్‌ను కేటాయించనున్నారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూధార్‌ను కేటాయించినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇకపై వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో తప్పనిసరిగా సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా ప్రభుత్వం అమలు చేస్తోంది. గతంలోని ధరణి పోర్టల్‌లో ఉన్న 36 రకాల మాడ్యూల్స్ వల్ల కలిగే గందరగోళాన్ని తొలగిస్తూ, భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు మంత్రి వివరించారు. రైతులు తమ ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి, ఒక్క క్లిక్‌తో తమ భూమికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందేలా పోర్టల్‌ను రూపొందించారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, దీని ద్వారా రైతులకు భూమిపై పూర్తి భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కొత్త పట్టాదారులకు 'రైతు భరోసా' ఊరట



- ఏప్రిల్ 15 నుంచి నిధుల జమ!
- 85 వేల మంది కొత్త రైతులకు లబ్ధి..
- దరఖాస్తుల పరిశీలనలో వ్యవసాయ శాఖ
- యాసంగి రెండో విడతగా రూ. 9,000 కోట్ల పంపిణీ లక్ష్యం

రాష్ట్రంలోని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఇప్పటివరకు పాత లబ్ధిదారులకే పరిమితమైన 'రైతు భరోసా' పెట్టుబడి సాయాన్ని, ఇకపై కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన వారు సుమారు 85 వేల మంది ఉన్నారని అంచనా వేయగా, అందులో ఇప్పటికే 62 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

**ఏప్రిల్ 15 నుంచి ఖాతాల్లోకి నగదు:**

ప్రస్తుతం ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. భూమి వివరాలు, పట్టాదారుల నిజానిజాలను నిర్ధారించిన తర్వాత వారం రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. అర్హులుగా తేలిన కొత్త రైతులకు ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీల మధ్య యాసంగి (రబీ) రెండో విడత నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో మొత్తం రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వానాకాలం సీజన్‌లో లబ్ధి పొందిన ప్రతి రైతుకు, ఈ యాసంగిలో కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి సాయం అందనుంది.

**రికార్డు స్థాయిలో నిధుల పంపిణీ:**

2025-26 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 69.39 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ. 6,000 చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లను కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే పంపిణీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. తాజా గణాంకాల ప్రకారం రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్యలో నల్లగొండ జిల్లా 5.22 లక్షల మందితో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సంగారెడ్డి (3.53 లక్షలు), ఖమ్మం (3.35 లక్షలు), సిద్ధిపేట (3.18 లక్షలు) జిల్లాలు ఉన్నాయి. మార్చి 22న మొదటి విడత నిధులను విడుదల చేసిన ప్రభుత్వం, ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడత నిధులను కూడా విడుదల చేసేందుకు కసరత్తు చేస్తోంది.

# నిప్పుల కొలిమిలా

**రానున్న మూడు నెలలు మండుటెండలు ఖాయం!**

**ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు**

**పది రోజులకు పైగా వీయనున్న వడగాడ్పులు.. ఐఎండీ హెచ్చరిక**

తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చేదు వార్త వినిపించింది. ఈ ఏడాది వేసవి సీజన్ మొత్తం ఎండలు మంట పుట్టించనున్నాయని, ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయని హెచ్చరించింది. రానున్న మూడు నెలల కాలానికి సంబంధించి ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై ఐఎండీ బుధవారం ప్రత్యేక బులెటిన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఈసారి భానుడు ప్రతాపం చూపనున్నాడు. ఏప్రిల్ నెలలో సగటున మూడు నుంచి నాలుగు రోజులు వడగాడ్పులు వీస్తుండగా, మే మరియు జూన్ నెలల్లో వీటి తీవ్రత మరింత పెరిగి పది రోజులకు పైగా కొనసాగే అవకాశం ఉంది. కేవలం పగటి పూట మాత్రమే కాకుండా, రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండి ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేయనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

**వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం:**

ఏప్రిల్ నెలలో ఉభయ గోదావరి జిల్లాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. అయితే, ఈశాన్య రాష్ట్రాలు మినహా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏప్రిల్‌లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. మార్చి నెలలో కూడా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో 'లానినా' ప్రభావం చివరి దశకు చేరుకుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు వాతావరణం తటస్థంగా ఉండి, నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యే జూన్ మాసం నుంచి 'ఎల్‌నినో' పరిస్థితులు మొదలవుతాయని ఐఎండీ వెల్లడించింది. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వడగాడ్పుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.


# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

- ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం
- వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశం

తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే పక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టార్గెట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.



# ధర్మపురిలో ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురి దుర్మరణం




**జగిత్యాల ప్రజాదివాస్ ఏప్రిల్ 02** ధర్మపురి పట్టణంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా అతివేగంతో వస్తున్న ఒక లారీ బీభత్సం సృష్టించింది. ఓవర్‌టేక్ చేసే క్రమంలో నియంత్రణ కోల్పోయిన లారీ, ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టి, ఆపై పక్కనే వెళుతున్న ఆటోను కూడా ఢీకొట్టింది.ఈ ఘోర ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ ఢీకొన్న ధాటికి ఆటో రోడ్డుపై బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న పలువురు హనుమాన్ భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను కాపాడే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన భక్తులను చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## తెర్లమద్ది లో ఎన్ సి డి వైద్య పరీక్షలు



**ముస్తాబాద్ / ఏప్రిల్ 2 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెరుమద్ది గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సబ్ సెంటర్లో డాక్టర్ అఫీజ గ్రామ సర్పంచ్ బైతి దుర్గవ్వ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఎన్ సి డి బీపీ షుగర్ ఇతర వ్యాధులపై వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజకుమార్ ఎం ఎల్ హెచ్ పి హెచ్ ఈ ఓ సూపర్వైజర్స్ ఏఎన్ఎం ధనలక్ష్మి ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## వేములవాడ విద్యుత్ శాఖ డీఈగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ




**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 02** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీఎల్) సిరిసిల్ల సర్కిల్ పరిధిలోని వేములవాడ డివిజన్ కొత్త డివిజనల్ ఇంజనీర్ (డి.ఈ.)గా వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. వేములవాడలోని తన కార్యాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే తన ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని, క్షేత్రస్థాయిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. బాధ్యతలు చేపట్టిన వెంకటరమణని వేములవాడ డివిజన్ పరిధిలోని ఏఈలు, సబ్ ఇంజనీర్లు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలంగాణ పథకాలు దేశానికే రోల్ మోడల్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 02** వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో మరియు వేములవాడ పట్టణంలోని 25వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తోందని, తెలంగాణ రాష్ట్రం నేడు దేశానికే రోల్ మోడల్‌గా మారిందని కొనియాడారు. జూన్ 2 నుండి రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు 5 లక్షల రూపాయల జీవిత బీమా కల్పించనున్నట్లు ఆయన ప్రకటించారు. గత పదేళ్లలో నిలిచిపోయిన రేషన్ కార్డుల జారీ ప్రక్రియను పునరుద్ధరించామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేయడంతో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మరియు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. స్థానిక సమస్యలపై స్పందిస్తూ.. చెక్కపల్లి కంచు కుంటలోకి రెండు రోజుల్లో నీరు విడుదల చేస్తామని, అలాగే చెక్కపల్లి-వట్టేముల రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.





# వేములవాడ రాజన్న దేవస్థానంలో హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు





**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 02** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం అభివృద్ధిలో భాగంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు ఏకాంతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహి ంచారు.హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా వీరాంజనేయ స్వామివారికి మంత్రోచ్చారణల మధ్య సుప్రభాత ధారాభిషేకం, మహాపూజలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం పరిధిలోని అనుబంధ ఆలయాలలో పరివార దేవతలకు, ఆలయంలో ఉన్న హనుమాన్ మూలమూర్తులకు మేళతాళాల మధ్య వేద స్వస్తి మంత్రాలతో చందనాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న--భీమన్న ఆలయాలతో పాటు అనుబంధ ఆలయాలను మామిడాకులు, కొబ్బరాకులతో చేసిన తోరణాలు మరియు రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు.ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా హనుమాన్ భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. దీంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ అర్చకులు, వేద పండితులు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

# రోడ్డు ప్రమాద బాదితులను కాపాడితే రహ వీర్ పథకం ద్వారా రూ.25 వేల పారితోషికం: ఎస్పీ మహేష్ బి.గీతే.

**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 02** రోడ్డు ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను (గుడ్ సమారిటన్స్) ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "రహ వీర్ పథకం" ద్వారా రూ.25,000/- నగదు పారితోషికం మరియు ప్రశంసా పత్రం అందజేయబడుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు. కానీ కొంతమంది పోలీస్ కేసులు ఉండొచ్చనే భయంతో గాయపడిన వారికి సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారని ఈ భయాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం "రహ వీర్ పథకం"ను అమలు చేస్తోందని తెలిపారు. ఈపథకం ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం రూ.25 వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తుంది. సహాయం చేసిన వ్యక్తిపై ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం ఇవ్వాలని, సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించాలని సూచించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రాణాలను కాపాడే కార్యంలో భాగస్వామి కావాలని కోరారు.




# వరకట్నం హత్య కేసులో భర్తతో పాటు మరో ఇద్దరికి జీవిత ఖైదు

**నేరాలకు పాల్పడిన వారికీ జైలు శిక్షలు తప్పదు,శిక్షలతోనే సమాజంలో మార్పు.**

**నిందుతులకు శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను , పిపిలను,కోర్ట్ కానిస్టేబుల్లను అభినందించిన జిల్లా ఎస్పీ.**

**రుద్రంగి మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 02**

రుద్రంగి పోలీస్ స్టేషన్ లో నమోదైన వరకట్నం వేధింపు హత్య కేసులో భర్తతో పాటు మరో ఇద్దరికి జీవిత ఖైదు విధించినట్లు గురువారం రోజున సిరిసిల్ల జిల్లా ప్రధాన నాయమూర్తి నీరజ తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.వివరాల మేరకు రుద్రంగి గ్రామానికి చెందిన ఏనుగందుల రాజయ్యకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన కుమార్తె హేమలత (పద్మ)ను అదే గ్రామానికి చెందిన సింగారపు జనార్ధన్‌కు కట్నాలు, కానుకలు ఇచ్చి వివాహం చేశారు. అయితే, వివాహం జరిగిన కొద్ది రోజుల తరువాత అదనపు కట్నం తీసుకురావాలని భర్త సింగారపు జనార్ధన్, ఆడపడుచు సింగారపు శారద, మేనల్లుడు తెడ్డు సాగర్, అలాగే జనార్ధన్ అన్న కుమార్తె సింగారపు దివ్య కలిసి హేమలతను వేధించడం ప్రారంభించారు.ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా, ఇకపై హేమలతను బాగా చూసుకుంటానని జనార్ధన్ హామీ ఇచ్చి, ఆమెను తిరిగి తనతో కాపురానికి తీసుకెళ్లాడు.తేదీ 3-4-2018 రోజున మళ్ళీ అదనపు వరకట్నం తీసుకొని రావాలని వేధించినడు ,అట్టి విషయంలో గొడవ జరుగగా పై నాలుగురు కలిసి హేమలతను కొట్టి చంపాలనే ఉద్దేశంతో రోకలి బండతో తల పైన కొట్టి చంపినారు.ఇట్టి కేసు లొ మృతురాలు యొక్క తమ్ముడు అయినా ఏనుగుందుల సతీష్ పిర్యాదు మేరకు అప్పటి రుద్రంగి ఎస్.ఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసింారు, ఇట్టి కేసు లొ అప్పటి డిఎస్పీ వెంకటరమణ కోర్ట్ లొ ఛార్జిషిట్ దాకాలు చేయగా, ఇట్టి కేసులో ప్రాసిక్యూషన్ తరుపున పెంట శ్రీనివాస్ వాదించగా చందుర్తి సి.ఐ వెంకటర్వర్లు, జమీ ాా× రవీందర్ నాయడు ఆధ్వర్యంలో కోర్ట్ వ ాానిటీరింగ్ కానిస్టేబులు నవీన్, లతీఫ్ , శ్రీనివాస్ లు కోర్ట్ లో 19 మంది సాక్షులను ప్రవేశ పెట్టగా కేసు పూర్వ పరాలు పరిశీలిచిన తరువాత సిరిసిల్ల జిల్లా ప్రధాన నాయమూర్తి నీరజ గారు నిందుతులకు ఒక్కొక్కరికి జీవిత ఖైదు తో పాటు ఒక్కొక్కరికి 2000/- రూపాయలు జరినామా విధించారు.ఇట్టి కేసు లొ ాా4 అయినట్టు వంటి సింగరపు దివ్య మైనర్ కావడం వలన ఆమె పైన కేసు ప్రస్తుతం జూవినల్ కోర్ట్ లో నడుస్తున్నదిఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకొలేరని,శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలిసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. పైకేసులలో నిందితులకి శిక్ష పడటంలో కృషి చేసిన పీపీలు పెంట శ్రీనివాస్, చందుర్తి సి.ఐ వెంకటర్వర్లు, జమీ ాా× రవీందర్ నాయడు,కోర్ట్ మానిటీరింగ్ కానిస్టేబులు నవీన్, లతీఫ్ , శ్రీనివాస్ లు అప్పటి పోలీస్ అధికారులు ఎస్.ఐ మరియు డిఎస్పీ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# గ్యాస్ పంపిణీ లో కొరత లేదు అసత్య ప్రచారాలు మానుకోండి




**ముస్తాబాద్ / ఏప్రిల్ 2 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో ఎల్పీజీ వంటగ్యాస్ కొరత ఉన్నట్లు కొంతమంది ప్రజలకు తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని ప్రతిరోజు దాదాపు 300 సిలిండర్ వరకు పంపిణీ జరుగుతుందని గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతిరోజు డోర్ డెలివరీ సేవలు కొనసాగుతున్నాయని ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని సరోజ ఇండియన్ గ్యాస్ నిర్వాహకులు కే దామోదర్ రావు అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు గ్యాస్ బుక్ చేసుకున్న ప్రతి ఒక్క వినియోగదారునికి గ్యాస్ ను సరఫరా చేస్తున్నాం. హోటళ్లకు, ఇతరులకు గ్యాస్ అక్రమంగా అమ్ముకుంటు న్నామని కొంతమంది మాపై దుష్ప్రచారం చేస్తున్నారని దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు మాకు తగిన ఆదేశాలను జారీ చేస్తున్నారని వారి ఆదేశాల మేరకు మేము ముస్తాబాద్ మండలంలో గ్యాస్ వినియోగ దారులందరికీ సక్రమంగా, పారదర్శకంగా గ్యాస్ పంపిణీ చేస్తున్నాము. ఎక్కడ కూడా కొరత లేకుండా ప్రతిరోజు పంపిణీ జరుగుతుంది బుకింగ్ ఉండి , డీఏ సి కోడ్ ఉన్న ప్రతి ఒక్కరికి గ్యాస్ ఇస్తున్నాము. కొందరికి బుకింగ్ చేసుకున్న వినియోగదారునికి డి ఏ సి కోడ్ సకాలంలో రాకపోవడం ఆన్లైన్ ప్రభావం వలన ఆలస్యం జరుగుతుందని అందువల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు తప్ప గ్యాస్ లేదనే మాట వాస్తవం కాదని అత్యవసరాలకు స్కూల్స్ హాస్టల్ ఆలస్యం జరగకుండా పంపిణీ జరుగుతుందని మాపై కొంత మంది ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే గ్యాస్ కొరత, మాఫియా అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారు. గల్ఫ్ యుద్ధం నేపథ్యంలో గతంలో అందుబాటులో ఉన్న విధంగా కాకుండా కొంత మేరకు సప్లై లో ఆలస్యం జరుగుతున్న వాస్తవాలను గ్రహించి ఈ సమయంలో మాకు ప్రజలు వినియోగదారులు మాకు సహకరించాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# సర్పంచ్ కొలుగూరి కిరణ్మయి మధు ఆధ్వర్యంలో చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీలో గ్రామ సభ

**-ప్రజా పాలన ప్రణాళికలో ఎంఎంఆర్ సమస్యలపై చర్చ..**

**బాధితులకు న్యాయం చేస్తామని సర్పంచ్ హామీ**





**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 02** వేములవాడ అర్బన్ మండల పరిధిలోని చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీలో గురువారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా స్థానిక సర్పంచ్ కొలుగూరి కిరణ్మయి మధు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాలనీవాసుల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే లక్ష్యంగా ఈ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఎంఎంఆర్ (వీవీ=) బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ గ్రామ సభలో ప్రత్యేకంగా చర్చించి, వాటిని ప్రణాళికలో చేర్చినట్లు ఆమె పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పరిహారం, ఇతర సాంకేతిక ఇబ్బందుల వల్ల ఇబ్బంది పడుతున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం మండల అధికారులు మాట్లాడుతూ.. ప్రజా పాలనలో భాగంగా అందిన ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలిస్తామని వెల్లడించారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ఆర్ అండ్ ఆర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# రుద్రవరంలో ఘనంగా 'ప్రజా పాలన 99 రోజుల ప్రణాళిక' గ్రామసభ







**- ప్రజా పాలనతో గడపగడపకూ ఆరు గ్యారెంటీలు: సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి**

**- రుద్రవరం సమస్యల పరిష్కారమే లక్ష్యం.. ప్రజా పాలన సభలో అధికారుల హామీ**

**- ప్రజా పాలన ప్రగతిపై రుద్రవరంలో అధికారుల సమీక్ష.. పెద్ద సంఖ్యలో హాజరైన గ్రామస్తులు**

**వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం** గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన 99 రోజుల ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఈరోజు గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా ఎంపీడీవో హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామసభను ఉద్దేశించి సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి మరియు ఉప సర్పంచ్ బెజగం మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన 99 రోజుల ప్రణాళిక' గురించి వివరించారు. ఈ ప్రణాళిక ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారెంటీలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.ఈ గ్రామసభలో వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, అన్ని శాఖల అధికారులు, మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం గురించి సర్పంచ్ మాట్లాడుతూ, "ప్రజా పాలన 99 రోజుల ప్రణాళిక" ద్వారా మా గ్రామంలోని సమస్యలను పరిష్కరించుకోవడానికి మరియు ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఇది ఒక మంచి అవకాశం అని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో మా గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు

## అగ్రహారం హనుమాన్ ఆలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేక పూజలు



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 02** చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అగ్రహారంలోని ప్రముఖ హనుమాన్ దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎస్పీకి ఆలయ పూజారులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఎస్పీకి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను కూడా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట సిరిసిల్ల డిఎస్పీ శ్రీనివాస్, పట్టణ సి.ఐ వీరప్రసాద్, ఆర్.ఐ సురేష్, ఏ.ఎస్.ఐ రాజుతో పాటు ఆలయ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి పాలనలో గ్రామస్తులు భాగస్వామ్యులు కావాలి....

**సర్పంచ్ -మల్లారపు జ్యోత్స్న అరుణ్ కుమార్**



**వీర్నపల్లి ఏప్రిల్ 2ప్రజా దివాస్** వీర్నపల్లి గ్రామంలో గురువారం రైతువేదికలో సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న -అరుణ్ కుమార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు ముందు రాష్ట్ర గీతాన్ని ఆలపించారు అనంతరం గ్రామస్థాయిలో అధికారులు ఆయా శాఖల వారిగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గ్రామస్తులను వివరించారు ఈ సందర్బంగా సర్పంచ్ మాట్లాడు తూ.... ఈ 99 రోజుల ప్రణాళికలో ప్రభుత్వ ఆదేశాల వేరకు అభివృద్ధి చేసుకుందాం అన్నారు గ్రామస్తుల సహకారం కార్యక్రమలో భాగస్వామ్యులు అవుతేనే అభివృద్ధి అవుతుందని అన్నారు ఈ కార్యక్రములో స్పెషల్ ఆఫీసర్,ఉపసర్పంచ్ జక్కుల నరేష్ కాంగ్రెస్ అధ్యక్షులు బూతు శీను, వార్డు సభ్యులు భగవంతం సురేష్ పద్మయ్య సంజీవ్,దేవలక్ష్మినారాయణ, లావణ్య గోరెమియా,రోజా నవనితా కార్యదర్శి వివిధ శాఖల అధికారులు ఉన్నారు

## ప్రజా పాలన గ్రామ సభలు.. వెల్లువెత్తిన సమస్యలు

**ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్న సర్పంచులు**



**వీర్న పల్లి ఏప్రిల్ 2 ప్రజా దివాస్** వీర్నపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజా పాలన 99 ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామానికి ఒక స్పెషల్ అధికారి బాధ్యత వహించారు. ఈ కార్యక్రమంలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు ప్రణాళిక అభివృద్ధి కార్యచరణను చేయడం జరిగింది ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి, గ్రామ సర్పంచ్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ల పురోగతి, నూతన తెల్ల రేషన్ కార్డు పొందిన జాబితా, రుణమాఫీ పథకం ద్వారా లబ్ధి పొందిన వారి జాబితా, రైతు భరోసా, గృహ జ్యోతి పథకం ద్వారా లబ్ధిదారుల జాబితా, సన్న వడ్ల ద్వారా బోనస్ పొందిన రైతుల జాబితా, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపించారు. పై పథకాలలో అర్హులై ఉండి కూడా రాలేదని.. చదివి వినిపించడం తప్ప ఆచరణ జరగలేదని అర్హులై ఉన్న గాని మాకు ఇల్లు ఇవ్వలేదని, రుణమాఫీ కాలేదని, కట్టుకునే వారికి ఇల్లు ఇవ్వకుండా కట్టని వారికి.. గ్రామానికి ఇల్లు ఇచ్చారని అనేక సమస్యలను లేవనెత్తారు. మండల కేంద్రంలో సర్పంచ్ జ్యోత్స్న అరుణ్ కుమార్ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన రోడ్డు ,డ్రైనేజ్, సమస్యలతో పాటు వైద్య సౌకర్యాల కొరత, సన్నం వడ్ల బోనస్ రాని వారి సమస్య, వెంకట్రాయని చెరువు బాధితుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉప సర్పంచులు వివిధ శాఖల అధికారులు మహిళలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.